క్లుప్తంగా

ఘనంగా గంగాలమ్మ జాతర


గంగాలమ్మ అమ్మవారు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామంలో గంగాలమ్మ జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గరగ నృత్యాలు, తీన్‌మార్ డప్పు వాయిద్యాలు, బుట్ట బొమ్మల వేషాలతో గ్రామోత్సవం జరిపారు. గురువారం అమ్మవారి తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోకవరం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై గోకవరం పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. దేవరపల్లికి చెందిన గంగిరాజు వీర్రాజు గత కొంత కాలంగా గుమ్మళ్లదొడ్డిలో నివాసం ఉంటూ స్థానిక హెచ్‌పీసీఎల్ ప్లాంట్‌లో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి బైక్‌పై ఇంటికి వెళుతుండగా కోరుకొండ నుంచి గుమ్మళ్లదొడ్డి వైపు వస్తున్న ఆవుల మంద అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు హెచ్‌సీ భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు శంకుస్థాపన

మధురపూడి: కోరుకొండలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ శంకుస్థాపన గురువారం ఉదయం 7.46 గంటలకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యుడు తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి బుధవారం ప్రకటన విడుదల చేశారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

మధురపూడి: వైద్య, ఆరోగ్యశాఖలో 22 ఏళ్లగా కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయడంపై రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు ఏపీ పారామెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దూళ్ల చటర్జీ అన్నారు. ఈ మేరకు కోరుకొండలో బుధవారం ప్రకటన విడుదల చేశారు. పాదయాత్రలో ఇచ్చిన హామీని సీఎం జగన్ నిలబెట్టుకున్నారన్నారు. రాష్ట్రంలో సుమారు 10 వేలమంది కుటుంబాలకు న్యాయం చేసినందుకు ఆయనకు రుణపడి ఉంటామన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం


దర్శనం చేసుకుంటున్న భక్తులు

రాజానగరం: మండలంలోని తూర్పుగానుగూడెంలో నిర్మించిన శ్రీలక్ష్మీ కుబేర స్వర్ణాకర్షణ కాలభైరవస్వామి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం 7.49 గంటలకు వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అనేక మంది భక్తులు తరలివచ్చి, స్వామివార్లను దర్శించుకున్నారు.

విద్యార్థులకు బహుమతులు


బహుమతులు అందుకున్న విద్యార్థులతో సతీష్‌బాబు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో గ్రంథాలయాధికారి టి.అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో 31వ రోజు బుధవారం వేసవి శిక్షణ శిబిరం కొనసాగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కస్నూరి సతీష్‌బాబు పాల్గొని విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన విభాగాల్లో పోటీలు నిర్వహించారు. రేష్మ సాహితి, తనూజ, హారిక, దీపిక, మహిమ విజేతలుగా నిలిచారు. వీరితో పాటు పాల్గొన్న విద్యార్థులందరికీ కేఎస్‌బీ ట్రస్ట్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్ ఇజ్జిన రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయ టీటీ పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ప్రకాశం నగర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 13 వరకూ భోపాల్ జరిగే అండర్ – 19 జాతీయ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌కు రాజమహేంద్రవరానికి చెందిన టెన్నిస్ క్రీడాకారులు ఛార్వి ఫాల్గుణ, గిడుతూరి సిరి పావని, గిడుతూరి తాన్యశ్రీ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. గత ఏడాది అక్టోబర్‌లో చెన్నైలో జరిగిన ఆలిండియా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ టోర్నమెంట్‌లో విజయం సాధించడం ద్వారా ఈ అర్హత సాధించారన్నారు. గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీకి చెందిన ఈ క్రీడాకారులు వీటీవీ సుబ్బారావు, పి.వేణుగోపాలరావు దగ్గర శిక్షణ పొందుతున్నారు.

సీతానగరం పీహెచ్‌సీకి మహర్దశ

- సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్‌కు క్యాబినెట్ ఆమోదం
- 23 పోస్టులు మంజూరు
- ఫలించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి




జక్కంపూడి రాజా

రాజానగరం: రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించడమే కాదు, వారంతా ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఈ నేపథ్యంలో తన నియోజకవర్గంలో ప్రజలందరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఆశయంతో స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా చేస్తున్న కృషికి ప్రభుత్వ పరంగా మద్దతు లభిస్తోంది. నియోజకవర్గంలో ఏటిపట్టు ప్రాంతంగా ఉన్న సీతానగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)గా అప్‌గ్రేడ్ చేయాలనే ఎమ్మెల్యే ప్రతిపాదనలకు బుధవారం జరిగిన రాష్ట్ర క్యాబినెట్‌లో ఆమోదం లభించింది. ఈ ఆస్పత్రికి 23 పోస్టులు కూడా మంజూరయ్యాయి.

మెరుగైన వైద్యసేవలు

మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి తరహాలోనే ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి కూడా రాష్ట్రంలో మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా ఆహర్నిశలు కృషి చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింతగా విస్తృత పర్చడంతోపాటు 108, 104 వాహనాలను కూడా ఆధునిక సదుపాయాలతో విస్తరించడం, ఫ్యామిలీ డాక్టర్ వంటి వినూత్న పథకాలను ప్రవేశపెట్టడం ఇందులో భాగమే. ఈ నేపథ్యంలో సీతానగరం పట్టణ ప్రాంతానికి సుదూరంగా ఉండటం వల్ల అక్కడి ప్రజలు అవసరమైన సమయాల్లో మెరుగైన వైద్యసేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను సీఎం జగన్ జిల్లాకు వచ్చిన సమయంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం అక్కడ ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. అలాగే రాష్ట్ర రాజధానికి వెళ్లిన సమయంలో కూడా ముఖ్యమంత్రిని, వైద్యఆరోగ్యశాఖ మంత్రిని, సంబంధిత ఉన్నతాధికారులను కలిసి సీతానగరం పీహెచ్‌సీ అప్‌గ్రేడ్ గురించి విన్నవించారు.

సఫలీకృతం

ఎట్టకేలకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి ఫలించింది. సీతానగరం పీహెచ్‌సీ అప్‌గ్రేడ్‌కు రాష్ట్ర క్యాబినెట్ కూడా ఆమోదం తెలిపింది. దీనితో పాటు గోదావరి వరదలకు గురయ్యే బొబ్బిల్లంకలో మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా నిర్మించనున్నారు. నియోజకవర్గంలో గతంలో ఎవ్వరూ పట్టించుకోకుండా వదిలేసిన ఇటువంటి అనేక సమస్యలపై ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ దృష్టి పెట్టి, వాటిని సాధించడంలో సఫలీకృతులయ్యారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అధ్యాపకుడి కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని కాకినాడ క్యాంపస్‌లో పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడిగా పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన డాక్టర్ మద్దా సత్యనారాయణ కుటుంబానికి బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. యూనివర్సిటీ తరఫున రూ.రెండు లక్షలు, అధ్యాపక సిబ్బంది తరఫున రూ.1.7 లక్షలను వీసీ ఆచార్య కె.పద్మరాజు చేతుల మీదుగా యూనివర్సిటీ క్యాంపస్‌లో అందించారు. కాకినాడ క్యాంపస్ సిబ్బంది ఇప్పటికే రూ.81 వేల ఆర్థిక సాయాన్ని ఆ కుటుంబానికి అందజేశారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కమలాకుమారి పాల్గొన్నారు.

అమృత సరోవర్ ట్యాంకుల పరిశీలన


అమృత సరోవర్ ట్యాంకులను పరిశీలిస్తున్న జిల్లా బృందం

సీతానగరం: మండలంలోని అమృత సరోవర్ ట్యాంకులను కలెక్టర్ నియమించిన బృందం బుధవారం పరిశీలించింది. నాగంపల్లిలోని రాముడు చెరువు, చీపురపల్లిలో కోరా వారి చెరువు, చినకొండేపూడిలోని ముత్యాలమ్మ చెరువు, మునికూడలిలోని పెరుగువారి చెరువులను అమృత సరోవర్ ట్యాంకులుగా ఎంపిక చేసి, వాటిలో పూడికతీత పనులు చేపట్టారు. గట్లను పటిష్ట పరిచి, వాటిపై మొక్కలు నాటారు. ఈ చెరువుల వద్ద దిమ్మలు ఏర్పాటు చేసి ఆగస్టు 15న జెండా వందనం చేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ పనులను బృందంలోని ఏడీఏ మల్లికార్జునరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అవినాష్, సోషల్ ఆడిట్ డీఆర్పీ అప్పలనాయుడు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వీరి వెంట ఏపీవో నాగేశ్వరవేణి, టెక్నికల్ అసిస్టెంట్ చక్రవర్తి, ఫీల్డ్ అసిస్టెంట్లు నగేష్ కుమార్, రాంబాబు, శ్రీనివాస్, ప్రకాష్ ఉన్నారు.

నియోజకవర్గంలో 117 ఆలయాల అభివృద్ధి


చినకొండేపూడిలో ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: రాజానగరం నియోజకవర్గంలో 117 ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం కణుపూరులో బుధవారం సీతారాముల ఆలయ పునప్రతిష్ఠ, విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జక్కంపూడి రాజా మాట్లాడుతూ టీటీడీ, శ్రీవాణి ట్రస్టు సౌజన్యంతో ఒక్కొక్క ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు ఖర్చుచేస్తున్నట్టు తెలిపారు. కణుపూరులో పునర్నిర్మించిన పురగిరి క్షత్రియ పెరిక సంఘం సీతారాముల ఆలయ నిర్మాణానికి రూ. 21 లక్షలు ఖర్చు చేశామన్నారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొన్నారు. కార్యక్రమంలో పురగిరి క్షత్రియ పెరిక సంఘం నాయకులు సంగన రామకృష్ణ, కాసుల అబ్బులు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కోకన్వీనర్ గణేశుల పోసి, గ్రామ సర్పంచ్ కరణం రమణ పాల్గొన్నారు.

భూమిపూజ

సీతానగరం: మండలంలోని చినకొండేపూడి రాజుపాలెంలోని కోదండ రామాలయం పునర్నిర్మాణానికి సంబంధించిన భూమిపూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ ఆలయాన్ని 1938లో నిర్మించారని, నేడు పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. సుమారు రూ.50 లక్షలతో ఆలయ నిర్మాణం చేపడుతున్నారని, అందులో భాగస్వాములైన ప్రతి ఒక్కరినీ అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సేవాదల్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, మండల సర్పంచ్‌ల సమాఖ్య సంఘం అధ్యక్షుడు కోంద్రపు ముత్యాలు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, ముదునూరి ప్రసాదరాజు, యర్రంశెట్టి బాబులు, బంగారయ్య, రవిరాజు, దివాకర్ వర్మ పాల్గొన్నారు.

వీరుళ్లమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


వీరుళ్లమ్మ ఆలయ పునఃనిర్మాణానికి భూమి పూజ నిర్వహించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: అనపర్తి గ్రామ దేవత వీరుళ్లమ్మ అమ్మవారి ఆలయ పునఃనిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులతో పాటు నేత్ర వైద్యులు డాక్టర్ తేతలి సత్యనారాయణ రెడ్డి, మస్తానమ్మ దంపతులు బుధవారం శంకుస్థాపన చేశారు. స్థానిక దేవీచౌక్-రైల్వేస్టేషన్ రోడ్డులోని వీరుళ్లమ్మ ఆలయ ప్రాంగణం పల్లంగా ఉండి వర్షాకాలంలో వర్షపు నీరు ఆలయంలోకి చేరుతుండడంతో ఆలయ పునఃనిర్మాణానికి ఆలయ కమిటీ శ్రీకారం చుట్టింది. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచి వారా కుమారి, అమ్మిరెడ్డి ఆయిల్స్ అధినేత సబ్బెళ్ల అమ్మిరెడ్డి, వ్యాపారవేత్త తేతలి రాధాకృష్ణారెడ్డి, నేషనల్ వెంకటరెడ్డి, నల్లమిల్లి బుల్లి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

స్థానిక పాతవూరులో పునఃనిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత జనార్ధన స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో భాగంగా బుధవారం కలశారాధన, ఉక్త హోమం, విగ్రహాలకు జలాధివాసం, అధివాస హోమాది క్రతువులు, సాయంత్రం శయనాధివాసం, హౌత్రం, విశేష హోమాది క్రతువులు నిర్వహించారు.

డాక్టర్ బాబు నియామకంపై హర్షం


ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను కలిసిన డాక్టర్ బాబు

సీతానగరం: మండల రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడిగా పెదపాటి రమేష్ బాబు (డాక్టర్ బాబు)ను నియమించడంపై ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మిని డాక్టర్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలకు డాక్టర్ బాబు సహాయ సహకారాలు అందించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. మదర్ థెరిస్సా సేవా సమితి, డాక్టర్‌బాబు ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో 24 ఏళ్ల నుంచి అనేక రక్తదాన శిబిరాలు నిర్వహించారన్నారు. స్వయంగా 121 సార్లు రక్తదానం చేశారన్నారు. ఇప్పటి వరకూ ఆయన ఆధ్వర్యంలో 21 వేల యూనిట్లు రక్తాన్ని సేకరించి ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం జరిగిందన్నారు.

ఈత పండు.. పోషకాలు మెండు..

- వేసవి నిస్సత్తువ నుంచి దూరం చేసే పండ్లు
- ఏడీబీ రోడ్డులో జోరుగా విక్రయాలు


ఏడీబీ రోడ్డు పక్కన అమ్మకానికి సిద్ధం చేసిన ఈత పళ్ల గుత్తులు

రంగంపేట: సీజన్ల వారీగా ప్రకృతి మానవులకు ఎన్నో రకాల పండ్లను అందిస్తుంది. అలాంటి పండ్లలో ఈత పండ్లది ప్రత్యేక స్థానం.. వేసవిలో పుచ్చకాయలు, తాటి ముంజెలు, మామిడి పండ్లు, సపోటా, నేరేడు ఇలా అనేక రకాల పండ్లు విరివిగా దర్శనమిస్తుంటాయి. ఈత చెట్ల నుంచి వచ్చే ఈత పండ్లు కూడా ఆ కోవలోనివే.. ఈత పండ్లలో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయి. పిండి పదార్థాలు, చక్కెర, పీచు పదార్థం, కొవ్వు, మాంసకత్తులు, విటమిన్ సి ఉండటంతో వేసవిలో ఈ పండ్లు తీసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలుంటాయని వైద్యులు చెబుతున్నారు.

ఎన్నో ప్రయోజనాలు

ఈత పండ్లు తింటే సమృద్ధిగా కాల్షియం లభించి ఎముకలు బలపడతాయి. ఈత పండ్లలో ఉండే గ్లూకోజ్, సుక్రోజ్, ఫ్రక్టోజ్‌లు తక్షణ శక్తినిచ్చి వేసవిలో వచ్చే నిస్సత్తువ, అలసటను దూరం చేస్తాయి. ఈత పండ్లు ఎక్కువగా తీసుకుంటే జీర్ణశక్తి బాగుండడంతో పాటు మలబద్ధకం లాంటి సమస్యలు తగ్గుతాయి. ఈత పండ్లలో ఐరన్ సమృద్ధిగా ఉండడం వల్ల వీటిని తీసుకుంటే ఎనీమియా సమస్య నుంచి బయటపడొచ్చు. ఈత పండ్ల ద్వారా తయారుచేసే ఈత బెల్లానికి కూడా మంచి డిమాండ్ ఉంది. మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలంలో వెంకటాపురం, సుభద్రంపేట, దొడ్డిగుంట, నల్లమిల్లి, సింగంపల్లి, జి.దొంతమూరు, వీరంపాలెం, ఈలకొలను, పెదరాయవరం, కోటపాడు తదితర గ్రామాల శివారు పొలాలు, చెరువు గట్లపై ఈత చెట్లు ఉన్నాయి. వేసవిలో అవి గుత్తులు, గుత్తులుగా ఈత పళ్లు కాస్తాయి. వాటిని రైతులు, వ్యాపారులు సేకరించి విక్రయిస్తారు.

ఏడీబీ రోడ్డులో విక్రయాలు

మధురమైన ఈత పండ్లను చిరు వ్యాపారులు ఏడీబీ రోడ్డు పక్కన విక్రయిస్తున్నారు. గుత్తులుగా ఉండే గెలలను, ప్యాకెట్లలోను ఈత పండ్లను విక్రయిస్తున్నారు. గెల మొత్తంగా కొంటే రూ.150 నుంచి రూ.200లకు, ప్లాస్టిక్ కవర్లలో ఉంచినవి కవరు రూ.20లకు విక్రయిస్తున్నారు. ఏడీబీ రోడ్డులో కార్లు, ద్విచక్ర వాహనాల్లో ప్రయాణిస్తున్న వారు ఈ పండ్లను కొనుక్కుని తినడమే కాకుండా ఇంటి వద్ద ఉన్న కుటుంబ సభ్యులకు, బంధువులకు తీసుకెళుతున్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధితో బాలుడికి పునర్జన్మ


చినకొండేపూడిలో జక్కంపూడి రాజాను కలిసిన మోక్షిత్ వీరసాయి తల్లిదండ్రులు

సీతానగరం: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.18 లక్షలు మంజూరు చేయించి, తమ బిడ్డ మోక్షిత్ వీరసాయికి పునర్జన్మ ప్రసాదించారంటూ జక్కంపూడి రాజాకు ఆ బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం చినకొండేపూడిలో ఉపసర్పంచ్ సత్తిపండు రాజు నివాసంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను వారు కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ బిడ్డకు వైద్యసేవలు అందించలేని పరిస్థితిలో ఉన్నప్పుడు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తమకు ధైర్యం చెప్పారన్నారు. తమ పరిస్థితిని చూసి, కాలేయ వ్యాధితో బాధపడుతున్న కుమారుడు మోక్షిత్ వీరసాయికి అండగా నిలిచారన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ 18 లక్షలు మంజూరు చేయించారన్నారు. ఆపరేషన్ అనంతరం బాలుడి మందుల కోసం ప్రతినెలా రూ.20 వేలు, ప్రతి వారం వివిధ టెస్టులకు రూ. మూడు వేలు ఖర్చవుతున్నాయన్నారు. ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి ఏదో రూపంలో పెన్షన్ వచ్చేలా చూడాలని ఎమ్మెల్యే రాజాను కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రాజా కలెక్టర్ దృష్టిలో ఉంచి తమ సమస్యకు పరిష్కారం చూపుతానని వారికి తెలిపారు.

నేడు, రేపు పుష్కరఘాట్‌లో మెప్మా బజార్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలకసంస్థ మెప్మా విభాగం ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో స్థానిక పుష్కరఘాట్ వద్ద మెప్మా అర్బన్ మార్కెట్ (బజార్) ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి నెలా రెండో గురు, శుక్రవారాల్లో ఈ మార్కెట్ ఉంటుందన్నారు. మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన దుస్తులు, స్త్రీల అలంకార వస్తువులు తదితర వాటిని విక్రయిస్తారన్నారు.

నగదు రహితం.. సులభతరం

- ఆన్‌లైన్ చెల్లింపులకు ప్రజల మొగ్గు
- నోట్ల ద్వారా లావాదేవీలకు క్రమంగా చెల్లుచీటీ
- పెరిగిన డిజిటల్ పేమెంట్లు



కిళ్లీ షాపులో క్యూఆర్‌కోడ్ బోర్డు


ఓ దుకాణంలో క్యూఆర్‌కోడ్ బోర్డు

రాజమహేంద్రవరం రూరల్: మనం ఇంటి నుంచి బయటకు వెళ్లినప్పుడు ఖర్చులకు జేబులో డబ్బులు లేకపోయినా ఎలాంటి చింత లేదు. బ్యాంక్ ఖాతాలో డబ్బులు, చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు, నగదు రహిత లావాదేవీలు జరిపి మనకు కావాల్సిన వస్తువులు కొనుక్కోవచ్చు. కొంతకాలంగా నోటును వినియోగించడం కంటే నగదు రహిత లావాదేవీలకే ప్రజలు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. కొంతకాలం క్రితం పెద్దపెద్ద మాల్స్, వ్యాపార సంస్థల్లోనే డిజిటల్ పేమెంట్లు చేసే అవకాశం ఉండేది. ప్రస్తుతం ఈ సౌకర్యం చిరు వ్యాపారాల చెంతకు సైతం చేరింది. నోటును వినియోగించి లావాదేవీలు చేయడం తగ్గుతుండగా, ఆన్‌లైన్‌లో నగదు రహిత లావాదేవీలవైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారు.

గణనీయమైన మార్పు

ఆరేళ్ల క్రితం పెద్ద నోట్ల రద్దు తరువాత డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రయత్నించినా అప్పట్లో పెద్దగా ప్రజలు ఆసక్తి చూపించేవారు కాదు. పెద్దపెద్ద మాల్స్‌లో మాత్రమే పేమెంట్ యాప్‌లు, క్రెడిట్, డెబిట్ కార్డులతో చెల్లింపులు జరిగేవి. నగదు వేరే వారి ఖాతాలోకి వెళ్లిపోతుందన్న అపోహలు, ఆర్థిక మోసాలు జరుగుతాయన్న ఆందోళనతో ప్రజల నగదు రహిత లావాదేవీలపై ఆసక్తి చూపేవారు కాదు. కోవిడ్ అనంతరం పరిణామాలతో నగదు రహిత లావాదేవీలు జరపడంలో గణనీయమైన మార్పులు వచ్చాయి.

అన్నిచోట్లా ఆన్‌లైన్ చెల్లింపులు

ఫోన్‌పే, గూగుల్‌పే, అమెజాన్ తదితర పేమెంట్ యాప్‌ల ద్వారా అన్నిచోట్లా ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగాయి. కిరాణా, ఫ్యాన్సీ, మందుల షాపులు, పెట్రోలు బంకులు, ఇతర దుకాణాలతో పాటు చివరకు కిళ్లీ షాపులు, నెట్టుడు బళ్లపై చిరు వ్యాపారులు, సైకిల్ పండ్ల వర్తకులు సైతం ఫోన్‌పే, గూగుల్ పే తదితర యాప్‌ల ద్వారా నగదు రహిత లావాదేవీలు జరుపుతున్నారు. మొబైల్ డీటీహెచ్, రీచార్జులు, గ్యాస్ బిల్లులు, ఇతర ఆర్థిక లావాదేవీలు చాలా వరకు ఈ యాప్‌ల ద్వారానే జరుగుతున్నాయి. పేమెంట్ యాప్‌లు వినియోగిస్తున్న వారిలో యువత ముందు వరసలో ఉందని ఆయా సంస్థల ప్రతినిధులు చెబుతున్నారు. టీ స్టాల్, భోజనం హోటళ్లు, తోపుడుబండ్లు, రోడ్ల పక్కన పండ్ల దుకాణాలు నిర్వహించే వ్యాపారులకు సైతం ఆన్‌లైన్ చెల్లింపులు ప్రయోజనకరంగా మారాయి. ప్రధానంగా చిల్లర సమస్యతో వీరికి వ్యాపారాలు పోతుంటాయి. ఆన్‌లైన్ చెల్లింపుల వల్ల చిల్లర సమస్య తీరడంతో చిరు వ్యాపారులు కూడా నగదు రహిత చెల్లింపుల వైపే మొగ్గుచూపుతున్నారు.

క్షణాల్లో క్యూఆర్ కోడ్ బోర్డులు

పేమెంట్ యాప్‌లకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌లను ఆయా సంస్థల ఏజెంట్లు క్షణాల్లో అందజేస్తున్నారు. ఇప్పుడు ఏ దుకాణం వద్ద చూసినా ఇవి దర్శనమిస్తున్నాయి. అయితే ఆన్‌లైన్ చెల్లింపులు సౌలభ్యంగా ఉండటంతో ఆదమరిస్తే మోసాలకు కూడా ఆస్కారం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. వీటిపై అవగాహన లేని వారిని లక్ష్యంగా చేసుకొని ఆన్‌లైన్ మాయగాళ్లు మోసాలకు పాల్పడుతుంటారు. అయితే ప్రస్తుతం కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన క్యూఆర్ కోడ్ స్పీకర్ బాక్సులు ఇలాంటి అక్రమాలకు చెక్ పెడుతున్నాయి. ఆన్‌లైన్ చెల్లింపులు జరగ్గానే దుకాణదారుడికి ఎంత జమ అయిందన్న విషయాన్ని ఆడియో ద్వారా వినిపిస్తుంది. తద్వారా మోసాలకు కూడా అడ్డుకట్ట పడుతుంది.

ఆన్‌లైన్‌లోనే ఎక్కువ చెల్లింపులు



ఎక్కువశాతం ఖాతాదారులు ఆన్‌లైన్‌లో నగదు చెల్లింపులు చేస్తున్నారు. గతంలో ఏదైనా వస్తువు కొనుగోలు చేస్తే చిల్లర సమస్యలతో వ్యాపారాలు జరిగేవి కావు. గతంలో పోలిస్తే ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగాయి. చిల్లర సమస్య కూడా తొలగిపోవడంతో వ్యాపారాలు జరుగుతున్నాయి.

– కొదవళ్ల సురేంద్ర, జ్యూస్ సెంటర్ నిర్వాహకుడు, బొమ్మూరు